చాలామంది తమ వృత్తుల్ని వదులుకోక తప్పడం లేదని నా దగ్గరకొచ్చేవాళ్ల వల్ల తెలిసింది. మాకూ ఇంతకు ముందులా ఇప్పుడు కళావంతులమనే గౌరవం లేదు. పోలీసు జులుం కూడా కొనసాగుతున్నది. అయినా ఇది తప్ప మరో పని చేయలేమని అనుకునేవాళ్లం. మా అమ్మా, పిన్నీ వయసు మీరడంతో ఈ మధ్యే.. ఏదో ఎన్జీవో కుట్టుమిషిన్లు ఇవ్వడంతో జాకెట్లు కుట్టడం నేర్చుకున్నారు. ఫర్వాలేదు.. కాసిన్ని డబ్బులు సంపాదిస్తున్నారు. మేమెలాగూ ఉన్నాం.

* * *

చలికాలం వచ్చేసింది. దుప్పట్ల అవసరం బాగా ఉంటుంది. అంచేతనే మాకూ డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. చాలామంది తమ కష్టాలను తలచుకుంటూ.. కన్నీళ్లు కారుస్తూ.. ఎదుటివాళ్ల సానుభూతి కోరుతూ చెప్పుకొంటారు. నాకది నచ్చదు. నా సుఖాలు ఎలాగ నావో.. నా దుఃఖాలూ అలాగే నావి. అందుకేనేమో నాకు మా వాళ్లకంటే కాస్త ధైర్యం ఎక్కువే.

చాలారోజుల తర్వాత.. రోజులేనా? కాదు.. నెలల తర్వాత మూర్తిగారు వచ్చారు. నా ముఖంలో దాచుకోలేనంత ఆనందం కనిపించినట్టుంది. మా విజయ వదిన వేళాకోళమాడింది.

''ఇంక మా మరదలు కొన్నాళ్లు స్వర్గంలో తేలిపోతుంది. మేం అసలు కనిపించం'' అన్నది నవ్వుతూ.

నేను సిగ్గుపడిపోయాను. నేనేనా..? అవును నేనే సిగ్గుల మొగ్గయ్యాను!

ఆ రాత్రి మూర్తిగారు నా భుజం మీద చెయ్యి వేయగానే.. నా ఒళ్లు ఝల్లుమంది. ఏమిటిది? అదే శరీరం కదా!? అలా ఎన్నో చేతులు నా మీద పడ్డాయి కదా!? మరి మూర్తిగారి చెయ్యి తాకినప్పుడల్లా ఎందుకిలా ఉంటుంది? చాలాకాలం తర్వాత వచ్చిన ఆయన చూపాల్సిన ఆదుర్దా, తొందర నాకు కలిగింది.

ఎప్పటిలాగే నా కళ్లలోకి చూస్తూ..

''కొత్త కొత్తగా ఉన్నదీ మా లలిత..'' అంటూ రాగం తీశారు.

ఎవరం ఏమేం చేశామో నాకు తెలివిడి లేనంతగా ఆ రాత్రి గడిచిపోయింది. హాయిగా గడిచిపోయింది అనో.. తీయగా నడిచిపోయింది అనో అనకపోవడానికి నాకు తెలియని కారణమేదో ఉండి ఉంటుంది. బహుశా.. అలాంటి మాటలను మించినదేదో ఉండి ఉంటుంది.

మూర్తిగారు ఎప్పటిలాగే తన దగ్గరున్న డబ్బు నా చేతికిచ్చారు. లెక్కెట్టలేదుగానీ.. పెద్ద మొత్తమే! ఆయన ఉన్నంతవరకూ ఏ కస్టమర్‌నూ నా దగ్గరికి పంపకూడదని అమ్మకు బాగా తెలుసు. అతను నన్ను పెళ్లాడితే నేను సుఖపడతానని ఆమె ఆశపడకపోలేదు. మర్నాడు అందరికంటే లేటుగా లేచాను. మా వదిన మళ్లీ వేళాకోళమాడింది. మా సుజాతక్క ఆమె నవ్వుతో శ్రుతి కలిపింది.

మూర్తిగారికి టిఫిన్ పెట్టి, నేనూ తింటూ కబుర్లు చెబుతూ కూర్చున్నాను. ఆయన తన సినిమా అనుభవాలు చెబుతూ జోకులేస్తున్నారు. సరదాగా చెబుతున్నా.. ఏదో విషాదం నాకు కనిపించింది. తను రాసిందేదీ తన పేరుతో రావడం లేదట. కొత్త కవి ఏది రాసినా, ఆఫీసు బాయ్‌తో సహా బాగోలేదన్నట్టుగా చప్పరించేస్తారట. అదే తను రాసిందే ప్రముఖ కవి పేరు మీదుంటే తెగ మెచ్చేసుకుంటారట.

''ఇకనైనా పెళ్లి చేసుకోరా!?'' అన్నాను మాట మార్చడానికీ, నా సంగతి తేల్చుకోడానికీ!

''అబ్బే! నేను పెళ్లికి పనికిరాను. మామూలు ఉద్యోగాలేవీ చేయలేను. రచయితగా ఎప్పుడెంత సంపాదిస్తానో నాకే తెలీదు. నువ్వు గమనించే ఉంటావు.. నాకు నిలకడ లేదు'' అన్నారాయన అతి మామూలుగా.

నాకు అర్థమైపోయింది. నిజమే! ఆయనకు కుదురు లేదు. మద్రాసులో ఏదో ఒక సినిమాకు ఘోస్ట్ రైటర్‌గా కొంత సొమ్ము చేతిలో పడగానే వాళ్లూరు రాజమండ్రి, తర్వాత నా దగ్గరికి వచ్చేస్తారు. చేతిలో డబ్బు అయిపోయేవరకూ ఇలాగే తిరుగుతారు. ఎంత ప్రతిభ ఉన్నా.. కొందరంతే అనుకున్నాను. నాకూ దగ్గర దగ్గర ముప్పై ఏళ్లు వస్తున్నాయి. మూర్తిగారితో బిడ్డను కనాలని అనుకున్నాను. నెలలో ఏ రోజుల్లో గర్భం దాల్చే అవకాశం ఉందో మాకు తెలుసు. ఆ రోజుల్లో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. ఇప్పుడు ఏ జాగ్రత్తలూ తీసుకోకుండానే ఆయనతో గడుపుతున్నాను.

''నాకంటే మీరే పవిత్రంగా ఉంటున్నారని అనిపిస్తున్నది'' అన్నాను మూర్తిగారితో సరదాగా. నిజానికి సీరియస్‌గానే.

''పవిత్రత అన్నది ఒక్కొక్కరి విషయంలో ఒకలాగ ఉండొచ్చు. నువ్వంటే నాకిష్టం కనుక.. నీతోనే ఉండాలని అనిపిస్తుంది. నీకో చిన్న కథ చెబుతాను. ఒకావిడ.. నీలాంటిదే. అయితే, ఆమె కూడా ఒకతణ్ని ప్రేమించింది. అతనిపట్ల పవిత్రంగా ఉండాలనుకుంది. ఏ విటుడినైనా అన్నీ ముట్టుకోనిచ్చేది కానీ, పెదాలను తాకనిచ్చేది కాదు. తన ప్రియుడు వచ్చినప్పుడు మాత్రమే.. పెదాలను తనకు తానే అందించేది. ఆ విధంగా ఆమె పవిత్రురాలు కదా. ఇక నువ్వు కూడా అలాంటిదానివే..'' అంటూ నా కళ్లలోకి చూశారు.

''ఎలాగ!?'' అన్నాను ఆశ్చర్యపోతూ.

''నీ మనసులో నేను మాత్రమే ఉన్నాను కదా. అంటే.. నీ మనసు పవిత్రం. అలాగ నువ్వు పవిత్రం'' అంటూ నా బుగ్గను సుతారంగా మీటారు.

నా మనసంతా ఆయనపై మరింత ప్రేమతో నిండిపోయింది. ప్రతిసారి కంటే నా కోరిక మీద మరో వారం రోజులుండి, దారి ఖర్చులకు మాత్రం తీసుకుని వెళ్లిపోయారు. అంతవరకూ ఆపుకొన్న కన్నీళ్లు ఇక ఆగలేదు.

కొన్నాళ్లకు నేను కడుపుతో ఉన్నట్టు రూఢి అయింది. మూర్తిగారికి తెలపాలని అనుకున్నాను. తను మద్రాసు నుంచి వచ్చేముందు ఓ కార్డు రాస్తుంటారు. అందులోని అడ్రస్‌కు ఈ సంతోష వార్త తెలుపుతూ లెటర్ రాశాను.. అందుతుందో లేదో అనుకుంటూ. ఆనందపడుతూ.. 'ఆరోగ్యం జాగ్రత్త!' అని జవాబు రాశారు. అబ్బాయి అయినా అమ్మాయి అయినా ఆరోగ్యంగా పుడితే చాలనుకున్నాను. అమ్మాయే పుట్టింది. మద్రాసుకు లెటరు రాశాను. నెల రోజులకు కానీ రాలేదు. పాపకు ఏమన్నా కొనమంటూ డబ్బు ఇచ్చారు. పాపకు స్ఫూర్తి అనే పేరు పెట్టారు. బాగా చదివించాలన్నారు. నాలుగురోజులుండి వెళ్లిపోయారు. మరో మూడు నెలలకు వచ్చారు. బాగా చిక్కిపోయారు. ఇంతకుముందు లేని మందు అలవాటైంది. ఈ లోకం మీద చాలా విసిగిపోయి ఉన్నారు. ఈసారి కూడా పెద్ద మొత్తమే నా చేతుల్లో పెట్టి వెళ్తుంటే..

''మందు మానెయ్యండి. ఆరోగ్యం జాగ్రత్త!'' అని మళ్లీ చెప్పాను. నన్ను దగ్గరికి తీసుకుని, ముద్దుపెట్టుకుని వెళ్లిపోయారు. అదే ఆఖరిసారి ఆయన్ని చూడటం.

* * *

మూర్తిగారి కోరిక ప్రకారమే స్ఫూర్తిని బాగా చదివించాను. నా వృత్తిలో ఆమె కొనసాగకూడదనే కోరిక నాకు గట్టిగా ఉండటం వల్ల, నేను కూడా టైలరింగ్ నేర్చుకుని అదనంగా సంపాదించడం వల్ల అది సాధ్యమైంది.

ఆయన అప్పుడప్పుడూ మనియార్డరు చేసేవారు. మా విజయ వదిన కొడుకు రమణ కూడా స్ఫూర్తితోపాటు మంచి మార్కులతో పాసయ్యి, ఉద్యోగస్తుడయ్యాడు. స్ఫూర్తికీ ఉద్యోగం వచ్చింది. మా అమ్మ వాళ్లిద్దరికీ పెళ్లి చేస్తే బావుంటుంది అన్నది. ఇద్దరూ ఇష్టమేనన్నారు. అలాగ వాళ్ల వివాహం అయిపోయింది. అమ్మ కాలం చేసింది. కాకినాడలో చక్కటి ఫ్లాట్ కొని, నన్నూ తమతో తీసుకుపోయారు. మూర్తిగారికి రాసిన రెండు ఉత్తరాలూ మద్రాసు నుంచి తిరిగి వచ్చేశాయి.

తర్వాత తెలిసింది.. నడుస్తున్న రైలు ఎక్కుతూ పడిపోయి ఆయన చనిపోయారని. ఏదో పత్రికలో ఫొటో వేశారట. నాకు చాలా రోజులు నిద్ర పట్టలేదు. మూర్తిగారి జ్ఞాపకాలు నాకెప్పుడూ ఆనందంగానే కాదు, పెద్ద అండగా కూడా ఉంటాయి. ఆయన ఫొటో పెద్దది చేయించి హాల్లో పెట్టింది స్ఫూర్తి.

''మీ పెళ్లి ఫొటో కూడా పెట్టు!'' అంటే..

''వద్దమ్మా. మాది కూడా పెడితే నాన్నగారి ఫొటోకు ప్రత్యేకత ఉండదు'' అన్నది.

కాలింగ్ బెల్ మోగితే.. వెళ్లి వణుకుతున్న చేతులతో తలుపు తీశాను. స్ఫూర్తి, మనవడు ప్రతిభా మూర్తితో పాటు రమణ కూడా ఉండటం చూసి ఆశ్చర్యపోయాను.

''ఏమిటి!? రేపు కదా ఊరి నుంచి రావాలి'' అన్నాను.

ముందే పనైపోవడంతో వచ్చేశానన్నాడు. వాళ్లు రిలాక్స్ అయ్యాక, స్ఫూర్తికి కథ కాగితాలు ఇచ్చి..

''కంపోజ్ చేసి, ఏదన్నా పత్రికకు పంపు'' అన్నాను.

వాటిని ఎగాదిగా చూసి..

''అమ్మా! కాగితాలు బాగా మాసిపోయి ఉండటం వల్ల నీ రైటింగ్ సరిగ్గా తెలీడం లేదు. నువ్వు నా పక్కన కూర్చుని చదువు. నేను కంపోజ్ చేస్తాను'' అన్నది స్ఫూర్తి.

ఎదురుగా ఫొటోలో నవ్వు ముఖంతో ఉన్న ఆయన్ని చూసి, సోఫాలోంచి లేచాను. ■

## కలిదిండి వెంకట సుబ్రహ్మణ్య వర్మ



సమాజంలోని విభిన్న కోణాలను స్పృశిస్తూ రచనలు చేస్తున్నారు కలిదిండి వెంకట సుబ్రహ్మణ్య వర్మ. తూర్పు గోదావరి జిల్లా పెనుమళ్ల ఈయన స్వస్థలం. 40 ఏండ్ల జర్నలిస్టు వృత్తి జీవితంలో వివిధ పత్రికలు, న్యూస్ చానళ్లలో ఉన్నత స్థాయిలో పనిచేశారు. ఈయన రాసిన మొదటికథ.. స్త్రీ హృదయం. 1968లో సుహాసిని మాస పత్రికలో ప్రచురితమైంది. ఇప్పటివరకూ 100కి పైగా కథలు, 30కి పైగా కవితలు వివిధ ప్రముఖ వార, మాస పత్రికల్లో వచ్చాయి. 'యుద్ధం', 'నేను నేనే', 'ఫీనిక్స్', 'మరొకడు మరి కొన్ని కథలు', 'కథ మంచికి' సంపుటాలు, 'ఎంత గొప్పవాడివిరా', 'కనక మహాలక్ష్మి – సింహాచలం' ఫీచర్స్ పుస్తకాలు, శ్రీశ్రీ పై వ్యాసాల పుస్తకం వెలువరించారు. ఇటీవలే 'మందుచూపు' కథ కాని కథలు, 'మూడావుల ముచ్చట్లు' ఫీచర్స్, 'ప్రకృతి స్పర్శ కథలు' పుస్తకాలుగా తీసుకొచ్చారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజాగ్రంథాలయం కథల పోటీలో వరుసగా 'ఫుట్‌బాల్', 'నీలాగే నేను' కథలకు బహుమతులు అందుకున్నారు.